# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 09 జనవరి 2023


## జిల్లా వ్యాప్తంగా 198 న్యాయ విజ్ఞాన సదస్సులు




కడప లీగల్, జనవరి , ప్రభాతవార్త:

మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై ఆదివారం జిల్లా వ్యాప్తంగా 198 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఎస్.కవిత తెలిపారు. ఈ సదస్సులో నల్సా పథకాలు, రాజ్యాంగ హక్కులు మరియు విధులు, మహిళా సాధికారత, సాంఘిక సంక్షేమ పథకాలు, సామూహిక విపత్తులు, హింసా బాధితులు, కార్మిక చట్టాలు, స్త్రీలు, పిల్లలు, వైకల్యాలు ఉన్న వ్యక్తులు, వృద్ధులు, కుల ఆధారిత తదితర వాటిపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు 181, 1098, 14567, 112, 100లపై అవగాహన కల్పించారు.

## చిత్తూరు జిల్లాలో కుషస్థలి నదిపై

# 85.27 కోట్లతో రెండు చెరువుల నిర్మాణం

### జలవనరులశాఖ టెండర్లు

రాజంపేట అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలో కుషస్థలి నదిపై 2 చెరువులు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 85.27 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు ఈ నిధులతో చెరువు నిర్మాణం చేపట్టేందుకు జలవనరులశాఖ నిర్ణయించింది. నగిరి మండలంలోని మొక్కలకండ్రిగ గ్రామం వద్ద కుషస్థలి నదిపై కొత్తచెరువు నిర్మాణం చేపట్టేందుకు 46.02 కోట్లు కేటాయించింది. అలాగే కార్వేటిమండలంలోని కత్తెరపల్లె గ్రామం వద్ద కుషస్థలి నదిపై కొత్త చెరువు నిర్మించేందుకు 39.27 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు జలవనరులశాఖ టెండర్లను ఆహ్వానించింది. ఈనెల 17నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు టెండరు నోటఫికేషన్ జారీ అయ్యింది. రివర్స్ టెండరింగ్ పద్ధతిలో ఈ పనులను చేపట్టనున్నారు.

# ప్రశాంతంగా ఏపీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్ష





**మొత్తం పరీక్షా కేంద్రాలు 19**

**దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 8024**

**ఉదయం పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య 5746**

**మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య 5723**

కడప జనవరి 8, ప్రభాతవార్త

ఆదివారం జిల్లాలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాలు, సూచనలతో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 19 కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు మొత్తం 8024 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరిగిన పరీక్షకు 5746 (71.61 శాతం ) మంది హాజరు కాగా, 2278 (28.39 శాతం ) మంది గైరుహాజరు అయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 5723 (71.32 శాతం) మంది హాజరు కాగా, 2301 (28.68 శాతం) మంది గైరుహాజరు అయ్యారని ఆ ప్రకటనలో డిఆర్వో తెలిపారు.

**లైజర్ ఆఫీసర్గా కడప డిఆర్ఓ ధర్మచంద్రారెడ్డి**

ఆదివారం జిల్లాలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలో భాగంగా వివేకానంద మహిళా డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రానికి లైజన్ ఆఫీసర్ గా తనను నియమించారని కడప ఆర్డీవో ధర్మచంద్రా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను పటిష్టంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా , డివిజన్ స్థాయి అధికారులను లైజన్ అధికారులను నియమించారన్నారు. తాను లైజన్ ఆఫీసర్ గా పనిచేసిన వివేకానంద మహిళా డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలల్లో పర్యవేక్షిస్తూ, పటిష్ట సెక్యూరిటీ మధ్య పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆర్డీవో తెలిపారు.




- రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇటుకలబట్టీలకు మట్టి తరలింపు
- నిబంధనలు తుంగలో తొక్కిన అధికారులు
- మట్టి మాఫియాతో ఇరిగేషన్ అధికారుల లోపాయికారి ఒప్పందాలు?

ఒబులవారిపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:

ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని చెరువుల్లో నీటి మట్టం పెరగడంతో నియోజకవర్గంలో కొన్ని చోట్ల చెరువుల నుంచి మట్టిని తరలించి ఇటుకల బట్టీ తయారీకి వినియోగించుకుంటున్న కొందరు యజమానులు కొన్ని చోట్ల నీటి సమస్య ఉండడంతో ఒక అడుగు ముందుకు వేశారు. ఈ నేపథ్యంలో ఒబులవారి పల్లె మండలం జిల్లెల్ల మండల చెరువు మొత్తంపై ఒక భాగం ఆక్రమణకు గురికావడంతో చెరువు లోకి వచ్చే వర్షపు నీటి కాలువలు మూసి వేయడంతో నీరు పెద్ద వర్షాలు వస్తే తప్ప తేలిక పాటి వర్షాలు వస్తే చెరువు నిండే పరిస్థితి లేదు. ఇదే అదునుగా తీసుకొని కొంత మంది మట్టి మాఫియా అడ్డదారుల్లో అడ్డూ అదుపు లేకుండా రాత్రింబవళ్లు తేడా లేకుండా చెరువు మట్టిని ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. నిబంధనలు గాలికొదిలి ఇబ్బడిముబ్బడిగా యంత్రాలతో తోడేస్తున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ సమన్వయ లోపం మట్టిమాఫియా ముఠాకు అన్ని విధాలా కలిసొచ్చిందనే చెప్పవచ్చు. ట్రిప్పుకు ఓ నాయకుడికి మామూళ్లు ముట్టచెప్పి బహిరంగంగా మట్టి తరలి స్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒబులవారిపల్లె మండలంలో చెరువులు శేషాచల అడవులకు దగ్గరలో ఉన్నాయి. వీటిలో సారవంతమైన మట్టి చెరువుల్లో ఉంది. వ్యవసాయ భూములు సారవంతం చేయడానికి పనికొచ్చే మట్టి ఇటుకల బట్టీలకు తరలించడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో నోళ్లెళ్లబెట్టడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారనే విమర్శలు లేకపోలేదు. రోజూ లక్షలాది రూపాయలు విలువ చేసే మట్టి అక్రమార్కుల పాలవుతోంది. ఇదే అదునుగా కొంత మంది కాంట్రాక్టర్లు, స్థానిక నాయకుల అండదండలతో నీటిపారుదల శాఖాధికారులతో లోపాయికార ఒప్పందం కుదుర్చుకొని వారికి భారీ మొత్తంలో ముడు పులు అందించి నిబంధనలకు తిలోదకా లిచ్చి మట్టిని కాజేస్తున్నారని ప్రజలు గుసగుసలాడు కుంటున్నారు. మరికొంత మంది ఏది ఏమైనా చెరువు మట్టి తరలింపులో పర్యవేక్షణ లేదని అటు రెవెన్యూ అధికారులు, ఇటు నీటి శాఖాధికారులు పారుదల శాఖాధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొని కలెక్టర్ అనుమతితో మట్టి తరలిస్తున్నారని అనుమతి తెచ్చుకున్న ఇటుకల బట్టీల యజమానులు పత్రాలు చూపడం మరికొంత మందికి ఆశ్చర్యం కల్పిస్తోంది. గతంలో కూడా నీటిపారుదల శాఖాధికారుల అనుమతికి కొంత మొత్తాన్ని శాఖాధికారులకు కాంట్రాక్టర్లు ముడుపులు అందించి అనుమతి తెచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే మాకేమీ ఊరికే రాలేదని ఇటుకల బట్టీల యజమానులు అంటున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేస్తే కానీ అనుమతి రాలేదని విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విషయాలన్నీ తేటతెల్లం కావడంతో కొందరు ప్రజా నాయకులు కూడా ప్రశ్నించినా మేము అను మతి తీసుకున్నామని చెప్పుకొస్తున్నారని పలువురు కమ్యూ నిస్టు నాయకులు కూడా వాపోతున్నారు. ఏది ఏమైనా అధికారుల పర్యవేక్షణ లోపంతో మట్టి మాఫియా రోజు రోజుకు చెలరేగిపోతోందని చెప్పవచ్చు. ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి కొంత భూభాగాన్ని మీటర్ల ద్వారా కొలిచి సున్నం పిండితో బాక్సులు గీచి రోజుకు పగలే ఇన్ని క్యూబిక్ మీటర్లు మట్టిని లోడుకోవాలని నిబంధనలుండేవి. అన్నిటికీ వెరసి నిబంధనలకు నీళ్లొదిలి చెరువులకు ఎక్కడ పడితే అక్కడ గుంతలు తీసి మట్టిని తీయడంతో భారీ గోతులు పడడంతో కొన్ని చోట్ల వర్షాలతో గుంటల్లో నీరు చేరి కొందరు విద్యార్థులు ఆ గుంతల్లో పడి మృత్యువాత పడిన సంఘటనలు లేకపోలేదు. జిల్లెళ్లకు మినహాయించి సంజీవపురం చెరువు, పెద్దఓరంపాడు చెరువు, వై.కోట, రెడ్డిపల్లె తదితర చెరువుల్లో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. అన్ని విధాలా నిబంధనల ప్రకారం వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము, దూళి లేయకుండా మట్టిని తరలించే కాంట్రాక్టర్లు నీటిని చల్లి ఇబ్బందులు లేకుండా చూడాలని నీటిపారుదలశాఖాది, కారులు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి ఏర్పాట్లు చూడాలని ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.

**నీటిపారుదలశాఖాధికారిని వివరణ కోరగా..**

ఏఈ చెంగలరాయుడును వివరణ కోరగా మట్టి తరలింపులో పర్యవేక్షణ కొరవడిందని, మట్టి తరలించే టప్పుడు అధికారులు ఎవరూ లేకుండా యంత్రాలతో ఎక్కడపడితే అక్కడ గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారని అడగగా మట్టిని తరలించేందుకు కలెక్టర్ అనుమతించారని మేము తమ విధుల ప్రకారం బాక్సులు వేసి అందులోనే మట్టిని తవ్వాలని చెప్పామన్నారు. అయితే అక్కడ వీఆర్ఏ లను ఉంచామని సోమవారం చెరువు వద్దకు వచ్చి మట్టి తరలింపును పర్యవేక్షిస్తామన్నారు. తహసీల్దారు వివరణ కోరగా ఇరిగేషన్ శాఖ వారు అనుమతి ఇచ్చారని నాకు ఎటువంటి సంబంధం లేదని నేను అనుమతి ఇవ్వలేదన్నారు.

# ప్రొద్దుటూరులో అభివృద్ధిని వేగవంతం చేస్తాం

### హై లెవెల్ వంతెనకు చేపట్టిన భూమి పూజలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి





ప్రొద్దుటూరు జనవరి 8, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీ లిస్తూ వేగవంతం చేసి రాబోయే ఎన్నికల నాటికి అభివృద్ధిలో మార్పు కనపడాలని సీఎం జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు కడప ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రామేశ్వరం పెన్నా సమీపంలో 53 కోట్లతో నిర్మించబోయే హై లెవెల్ వంతెనకు స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డితో కలిసి ఆయన పనులు ప్రారం భించేందుకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పెన్నా పై నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన ప్రొద్దుటూరు వాసులకు ఆర్టీపి వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు అలాగే జనవరి మాసం చివరిలో జెఎస్ డబ్ల్యూ కంపెనీ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీకి సీఎం జగన్ పనులు ప్రారంభించేందుకు రానున్నానన్నారు. అలాంటప్పుడు ఈ వంతెన నిర్మాణం ఉక్కు ఫ్యాక్టరీకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు గత డిసెంబర్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 520 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే అన్నారు అందులో భాగంగా ఇప్పటికే బస్టాండ్ నిర్మాణం మార్కెట్ నిర్మాణం వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణంలోని ఐదు ప్రధాన మురికినీటి కాలువల ఆధునీకరణ, త్రాగునీటి కొత్త పైపులైన్ ఏర్పాటు, ఆసుపత్రి అభివృద్ధి, ఎస్ సి ఎన్ ఆర్ డిగ్రీ కాలేజీ అభివృద్ధి పనులను ప్రారంభించవలసి ఉందన్నారు. గత డిసెంబర్ నెలలో సీఎం జగన్ పర్యటనలో భాగంగా తనకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ప్రొద్దుటూరు అభివృద్ధి పనులను వేగవంతం చేసి మార్పు చూపించాలని సూచించారన్నారు.

**ప్రొద్దుటూరు అభివృద్ధి సీఎంతోనే సాధ్యం : ఎమ్మెల్యే**

30 సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనుకబడిన ప్రొద్దుటూరు నియోజక వర్గం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అయినప్పటి నుండి అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు వైసిపి ప్రభుత్వం అధికారం (మిగతా IIవ పేజీలో)

# చంద్రబాబుకివే చివరి ఎన్నికలు కావొచ్చు

**టీడిపై ప్రజల్లో విశ్వాసం, ఆదరణ ఉంటే, గెలిచే సత్తా ఉంటే పొత్తులెందుకు : జడ్పి చైర్మన్ ఆకేపాటి**

**సిఎం జగన్‌కు ప్రజాభిమాం ఉంది... ప్రతిపక్షం ఎన్ని కుట్రలు పన్నినా ఏమి చేయలేరు : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

రాయచోటి.జనవరి 08 ప్రభాతవార్త



చం ద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావొచ్చని జెడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్ నాధరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలోని జెడ్పి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాధరెడ్డి మాట్లడుతూ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పర్యటనలతో అమాయక ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇరుకైన సందుల్లో జనాలను తరలించి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నట్లుగా డ్రోన్ కేమెరాలతో చిత్రీకరణ కోసం ప్రజలు మృతికి కారకులయ్యారన్నారు. ప్రజలలో టీడిపి పై విశ్వాసం ఉంటే గెలిచే సత్తా ఉంటే ఇక పవన్ కళ్యాణ్ తదితర పార్టీలుతో పొత్తులెందుకని ఆయన ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలున కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జీవో నంబర్ 1 తెచ్చింది తెలుగుదేశం పార్టీ కోసం ఒకదానికే కాదని ఇది అందరికి వర్తిస్తుందన్నారు. చంద్రబాబునాయుడు బుద్ధి మార్చుకోవాలని, సీనియర్ నాయకుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా పేరు నిలబెట్టుకోవాలని అమర్‌నాధరెడ్డి హితవుపలికారు.

**ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.....**

ప్రతిపక్షం ప్రతి చిన్నదానికి రాద్ధాంతం చేస్తోందని, ప్రతి ఒక్కరు మంచిని స్వాగతించాలని, అధికారమే మా అజెండా అని, అందుకోసమే ఎంతవరమైనా టీడిపి దిగజారుతోందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం తెచ్చిన జీవో నంబర్1 చీకటి జీవో అని టీడిపి గగ్గోలు పెట్టడం సరికాదన్నారు. నడిరోడ్లపై సభలు సమావేశాలు పెట్టడం ప్రజలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ అనుమతితో ఖాళీ మైదానాలలో, ప్రదేశాలలో సభలు పెట్టుకోమని ప్రభుత్వం చెబుతున్నా ప్రతిపక్షం అడ్డగోలుగా మాట్లాడటం దారుణమన్నారు. ఇరుకు సందులలో సభలు పెట్టి కందుకూరులో 8 మంది మరణానికి కారకులయ్యారన్నారు. సభలో ప్రజల మరణాలు పట్ల చంద్రబాబుకు బాధ కలగడం లేదన్నారు. చంద్రబాబుకు ఈ వయస్సులో కూడా పదవీ వ్యామోహం తగ్గడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు ఏమి మంచి చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ప్రజలంతా వారి వైపే ఉన్నారని, చంద్రబాబు అండ్ కో మాట్లాడుతున్నారని, మీరందరూ కలవండి, కలిసి పోటీ చేయడం, బిపారంలు కలసి ఒకరికొకరు ఇచ్చుకున్నా ఎవరై భయపడే స్థితిలో లేరన్నారు. మీరందరూ కుమ్మక్కు కావడమే జగన్ సక్సెస్ అని స్పష్టంగా తెలుస్తోందన్నారు. సిఎం జగన్‌కు ప్రజాభిమానం మెండుగా ఉందన్నారు.

# యదేచ్ఛగా చికెన్ వ్యర్థాల తరలింపు

### చేపల, రొయ్యల ఆహారానికని తెలిసినా చలించని అధికారులు

### కనీస భద్రతా నియమాలు పాటించని వైనం



చిట్వేలి, జనవరి 8 ప్రభాతవార్త

చికెన్ వ్యర్థాల వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా అడ్డు అదుపు లేకుండా యదేచ్ఛగా కొనసాగుతోంది. ఎదుటివారి ఆరోగ్యంతో మాకేంటి పని..?? డబ్బులు వస్తే చాలు..!! అన్నట్లు వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. మాంసాహార ప్రియులు చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు అమితంగా ఇష్టపడే ఆహారం చేపలు. ఇవి పలు రకాలుగా ఉన్నప్పటికీ అన్నింటిలోనూ పలు పోషకాలు, కొవ్వు పరిమాణం లేకపోవడం, తేలికపాటి జీర్ణం చేపల ప్రత్యేకత. రాపూరు, నెల్లూరు రహదారి వ్యర్థాల తరలింపుకు రాజమార్గంగా నిలుస్తోంది. అన్నమయ్య జిల్లా పరిధిలోని నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి తదితర ప్రాంతాల నుంచి రెండు మూడు రోజులుగా కుల్లపెట్టిన వేలాది టన్నుల వ్యర్థాలను సుమారు 10 నుంచి 20 వాహనాలు డ్రమ్ములకు నింపుకొని దానిపై కనీసం భద్రతగా మూతలు, పట్టలు వేయకుండా విపరీతమైన దుర్గంధపు చెడు వాసనను కలిగిస్తూ పట్టణ, పల్లెల గుండా తరలిస్తున్నారు. చేపల, రొయ్యల పెంపకానికి పోషకాలతో కూడిన మిల్లెట్స్, తవుడు, మొక్కజొన్న పిండి తదితర వాటిని ఉపయోగించాలన్న నియమం ఉన్నప్పటికీ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం గడించవచ్చు అన్న మార్గం ఎంచుకున్న చేపల పెంపకందారులు వ్యర్థాలను తరలించే వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి ఇష్టానురీతిలో ఉపయోగిస్తున్నప్పటికీ ప్రజా ఆరోగ్యాలను కాపాడాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు తమ జేబులు నింపుకుంటూ చోద్యం చూస్తున్నారు. నెల్లూరు జిల్లాలోని పరిసర ప్రాంతాల్లో చేపల, రొయ్యల పెంపకం విస్తారంగా కొనసాగుతూ తక్కువ ఖర్చుతో చికెన్ వ్యర్థాలను ఉపయోగించి ప్రజల ఆరోగ్యాలకు అనేక రోగాలను పంచుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. దారి పొడవునా చెక్ పోస్టులు ఉన్నప్పటికీ తరలింపుదారులకు భద్రతా నియమాలను సూచించడంలో విఫలమయ్యారని, పైగా మామూళ్ల మత్తులో పో..రైట్ అంటున్నారని చెప్పక తప్పదు. కాగా ఆయా పంచాయతి పరిధిలోని సర్పంచులు వ్యర్థాల తరలింపు వాహనాలపై ఆంక్షలు విధించి చర్యలు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ ముందుకు రాకపోవడం ఆలోచించాల్సిన విషయం. పరిసర ప్రాంతాల్లో లభించే చేపలను కొనుగోలు చేయడం తినడం మంచిదని పలువురు అంటున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చే చేపలను కొనకపోవడం వల్ల ఒకదిశగా అనారోగ్యాలను నిరోధించవచ్చని కొంతమంది సూచన. ఇకనైనా అన్నిశాఖలు ఏకమై వ్యర్థాలు తరలింపుదారులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రోళ్లమడుగు పెద్దూరు గ్రామానికి త్వరలో రోడ్డు ఏర్పాటు

రాజంపేట అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త



మండలంలోని మారుమూల గ్రామమైన రోళ్లమడుగు పెద్దూరు గ్రామానికి త్వరలోనే రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని జడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికులు రోడ్డులేని విషయాన్ని జడ్పి చైర్మన్‌కు తెలపడంతో ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానిక నేతలతో చర్చించారు. అనంతరం రోడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోళ్లమడుగు సర్పంచ్ రఘురామరాజు, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, సుబ్బరాజు, రమేష్‌నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నరంగనాధస్వామి కళ్యాణోత్సవం

రాజంపేట అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త



రాజంపేట పట్టణంలో ఆదివారం శ్రీగోదాదేవి, శ్రీమహాలక్ష్మీదేవీ సమేత శ్రీ ప్రసన్న రంగనాథస్వామి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక తిరుప్పావై భక్తజన సేవాసంఘం ఆధ్వర్యంలో తోట కళ్యాణమండపంలో నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు కళ్యాణోత్సవానికి తరలివచ్చారు. రాజంపేటలో మొదటిసారిగా గోదాదేవి కళ్యాణం జరుగుతుండడంతో మహిళలు భారీగా తరలివచ్చారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు తోటనగేష్, పెంచలయ్యనాయుడు, టిటిడి ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ పాల్గొన్నారు.

# మండలంలో ఆగని భూకబ్జాలు

నందలూరు, జనవరి 8 ప్రభాతవార్త



నందలూరు మండలంలోని ప్రధాన రహదారి రేణిగుంట - కడప హైవేని ఆనుకొని ఉన్న కన్యకచెరువు సమీపంలో సుమారు 10 లక్షలు విలువ చేసే భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా, మండల తహశిల్దారు ఉదయ్‌శంకర్‌రాజులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొనేవారిపై చర్యలు తీసుకొంటున్నప్పటికి భూ ఆక్రమణలు మాత్రం తగ్గకపోవడం శోచణీయం. ఇప్పటికే మండలంలో ఎన్నో ఎకరాల భూమి కబ్జాకు గురైందని వారిపై చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీ చేసినప్పటికి అవేమి తమకు చెల్లవు అన్నట్లుగా కబ్జాల పరంపర కొనసాగుతోంది. దీనిపై తహశిల్దారును వివరణ కోరగా స్థలాన్ని పరిశీలించి కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.


సర్వేలతో భూ బకాసురుల గుండెల్లో గుబులు IIలో

యాదవుల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం IIలో

ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేవి క్రీడలు IIలో

## చర్చిలో టీడీపీ నాయకుల ప్రార్థనలు

కడప కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త:



టీడీపీ అధినేత చంద్రబాబు, యువ నేత నారా లోకేష్‌ల యాత్రలు విజయవంతం కావాలంటూ కడప కేథడ్రల్ చర్చిలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాజా వారిని ఆశీర్వదించారు. చర్చి సభ్యులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సమస్యలపై మాట్లాడే వారిపై నిర్బంధాలు ఎక్కువయ్యాయి. అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చంద్రబాబు చేస్తున్న పోరాటం, నారా లోకేష్ చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం కావాలని ప్రార్థించినట్లు వారు చెప్పారు.

## రాష్ట్ర తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త:



రాష్ట్ర తొగట వీర క్షత్రియ 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆదివారం కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యా సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడుతూ 2023లో అందరికీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోనూ, జిల్లా లోనూ సంఘాన్ని మరింత బలోపేతం చేసి అన్ని రంగాల్లో ముందుకు కొన సాగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడప సంఘం నగర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహా రావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన, యూత్ అధ్యక్షులు మోతుకూరు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు మోతుకూరు సుబ్బ రాయుడు, గౌరవాధ్యక్షులు పల్లా బాల చౌదన్న, ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, బొలిశెట్టి వెంకట స్వామి, దొడ్ల వెంకటరమణ, కొరకూటి వెంకట సుబ్బన్న, కేతినేని సుబ్బరాయుడు బండి కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు బొమ్మల వెంకటయ్య, బోలిశెట్టి వెంకటసుబ్బయ్య, వెలిగండ్ల వెంకట సుబ్బరాయుడు, టేకూరి పుష్పాం గద, కాల్వవాగేష్ కొరముట్ల సుబ్బరాయుడు, పల్లా వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

## వివాదా రహితుడు మంత్రి అంజాద్‌బాషా

కడప కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త:



ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల కోసం ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పాటు పడుతున్నారని కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లెకొండు సంపత్, వైఎస్ఆర్ సీపీ దళిత మహిళా నాయకురాలు చైతన్యలు కొనియాడారు. పెన్షన్లు తొలగించారని నెపంతో ఆయనపై కొంత మంది విమర్శలు చేయడం సరికాదన్నారు. దళితులకు మంత్రి అంజాద్ బాషా ఎప్పుడు అండగా ఉంటారన్నారు. సాంకేతిక లోపాల కారణంగానే కొంత మందికి నోటీసులు ఇచ్చారన్నారు. సరైన సమాధానం వాలంటరీలకు ఇస్తే సరిపతుందని చెప్పారు.

## గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలు పట్టించుకోవాలి : సిపిఐ

కడప ఏడురోడ్లు, జనవరి 8, ప్రభాతవార్త:



నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల లెక్కల వివరాలే కాకుండా స్థానిక మౌలిక సమస్యలపై కూడా దృష్టి సారించాలని, విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కార మార్గాలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ పేర్కొన్నారు. ఆది వారం స్థానిక 11వ డివిజన్ పరిధిలో గల మృత్యుంజయకుంటలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిం చాలని సీపీఐ నేతృత్వంలో స్థానికులు సంతకాల కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట శివ మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాం డుకు కూత వేటు దూరంలో ఉన్న మృత్యుంజయ కుంటలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా స్థానిక మౌలిక సమస్యలను పరిగణలోకి తీసుకొని నిధుల కేటాయింపులు చేపట్టి వీధి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, 11వ డివిజన్ సీపీఐ నాయకురాలు వడ్ల భాగ్యలక్ష్మి, నగర కార్య వర్గ సభ్యులు పగడ పూల మల్లికార్జున, నాగిరెడ్డి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నగర నాయకులు సంజీవ్, చైతన్య, స్థానికులు శేషారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు, సహదేవ, భాగ్యమ్మ, సుబ్బమ్మ, జయలక్ష్మి, ఉమాదేవి, నాగలక్ష్మి, మహాలక్ష్మి, పెంచలమ్మ, రాధా, రమణ, జయమ్మ, వరలక్ష్మి, మల్లీశ్వరీ పాల్గొన్నారు.

## సెమీఫైనల్‌కు చేరుకున్న కడప ఎస్పీడీసీఎల్

కడప ఏడురోడ్లు, జనవరి 8, ప్రభాతవార్త:



కడప ఆపరేషన్ ఎస్పీడీసీఎల్ వర్సెస్ అనంతపురం ఆపరేషన్ సర్కిల్‌తో మ్యాచ్ ఆదివారం జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కడప ఆపరేషన్ ఎస్పీడీసీఎల్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 168 పరుగులు సాధించింది. జట్టులో మహ్మద్ 39 బంతుల్లో 57 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత ఓవర్లలో 123 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. నరేంద్రారెడ్డి 3.5 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. ఈ విజయంతో కడప జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది.

## ఉపాధ్యాయ ఉద్యమనేత బాలకృష్ణమ్మకు నివాళి

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ ఉద్యమనేత, మాజీ శాసనమండలి సభ్యులు మార్పు బాల కృష్ణమ్మకు 10వ వర్ధంతి సందర్భంగా కడపలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీటీఎఫ్ అధ్యక్షులు హృదయరాజు అధ్యక్షతన స్మారకోపన్యాసం జరిగింది. సమావేశానికి నవోదయ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు డా.జతిన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బాలకృష్ణమ్మ మాతృభాషలోనే బోధనా భ్యాసన ఉండాలని పరితపించిన వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షులు ఉపా ధ్యాయ ప్రగతి సంపాదకులు జి.సత్యనారాయణ ఐపియా జాతీయ ఉపాధ్య క్షులు కె.సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖరరెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి చెంగ్రాయ, కడప జిల్లా ఉపాధ్యక్షులు వీరాంజనేయులరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు అభివృద్ధిని వేగవంతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన మూడున్నర సంవత్సరాలలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి మూడు వేల కోట్లు కేటాయించారన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కోవాలన్న ఉద్దేశంతో మహిళా స్వావలంబన దిశగా దళారీ వ్యవస్థ లేకుండా నియోజక వర్గంలో 1076 కోట్లు నగదు నేరుగా మహిళల ఖాతాలలో జమ చేసిన ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. హై లెవెల్ వంతెన నిర్మాణం చేపడితే జగనన్న కాలనీకి ఆర్టీపీకి ఉక్కు ఫ్యాక్టరీకి ఎంతో సౌకర్య వంతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మండలాధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ రాష్ట్ర వైసీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కోనేటి నరసింహారెడ్డి పట్టణ వైసిపి మహిళా అధ్యక్షులు కోనేటి సునంద కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి ఇర్ఫాన్‌భాష వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## సర్వేలతో భూ బకాసురుల గుండెల్లో గుబులు

ఓబులవారిపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 2204 భూములను సంబంధించిన భూ సర్వేలు వేగవంతం చేయడంతో భూములు ఆక్రమించిన భూ బకాసురుల గుండెల్లో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. మొత్తం ఈ సర్వే నెంబర్ 1100 ఎకరాలు ఉండడంతో కొందరు పత్రాలున్నా, లేకపోయినా వారి శక్తిమేరకు భూములను ఆక్రమించి చదును చేసుకొని కొంత భూభాగాన్ని పంటలు పండించుకుంటున్నారు. అయితే కొంత భూమిని చదును చేసి నా భూమి అని హద్దులు వేసుకొని కంచె వేసుకున్నారు. అయితే కొంత మంది భూమి లేని నిరుపేదలు అక్కడ నాయకుల ద్వారా అదికారులకు తెలియడంతో కలెక్టర్ గిరిష అర్హుల భూములు గుర్తించి అనర్హులు భూ ఆక్రమించిన వారి వివరాలు, ఎంత భూమి ఎవరి పరిధిలో ఉన్నది అనే నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని డివిజన్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రాజంపేట ఆర్డీవో కోదండరామిరెడ్డి ఓబులవారిపల్లె తహసీల్దార్ పీర్‌మున్నీ భూసర్వేలు వేగవంతం చేయిస్తున్నారు. కొంత మందికి అన్యాయం జరిగినా నిజమైన పేదవారు, అర్హు లైన వారికి జగ నన్న శాశ్వత భూహక్కు పత్రాలు పట్టాల రూపాలో అర్హులకు అందుతాయని ఆశిస్తున్నామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంత మందికి పట్టాలిచ్చినా 800 ఎకరాలు మాత్రం కొత్త నెంబర్లలో సబ్ డివిజన్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులు అసైన్‌కమిటీలో పొందుపరచకుండా అనుమతి పత్రాలు ఇచ్చినట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా భూములను గుర్తించి అర్హులకు అందిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటిపై విరిగి పడిన విద్యుత్తు స్తంభం

జమ్మలమడుగు, జనవరి 8, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మండల పరిధిలోని దర్మాపురం గ్రామంలో విద్యుత్తు స్తంభం విరిగి రేకుల ఇంటిపై పడింది. ఈ ఘటనతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు, స్థానికులు ఊపిరి పీల్చుయున్నారు. విద్యుత్తు అధికారులు కరెంటు సరఫరా నిలిపివేసి విద్యుత్తు స్తంభాన్ని తొలగించారు.

## నేడు గడప గడపకు మన ప్రభుత్వం..

జమ్మలమడుగు, జనవరి 8, ప్రభాతవార్త:

జమ్మలమడుగు టౌన్, మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని నీళ్ల ట్యాంక్ దగ్గర నుంచి సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.మూలే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలోపాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రోడ్ల విస్తరణ పనుల్లో వివక్ష తగదు

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:

కడప మున్సిపల్ పరిధిలో రోడ్ల విస్తరణ పనుల్లో వివక్ష చూపిస్తున్న మున్సిపల్ అధికారులు తక్షణం పేదలు నివసించే ప్రాంతాల్లో మార్కింగ్ అయ్యే వరక ఇళ్లను కూల్చారు. మరి క్రిస్టియన్‌లైన్‌లో మార్కింగ్ వేసినా ఇంత వరకు విస్తరణ జరగలేదు ఎందుకని రైతు రాజ్యం పార్టీ ఏపీ రాష్ట్ర రైతు రాజ్యం ప్రశ్నిస్తోందన్నారు. మాసాపేట, చలమారెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో పేదలున్నారని వారి ఇళ్లను కూల్చితే ఎవరూ అడగరని అక్కడ మాత్రమే అధికారులు పనులు చేయడం అన్యాయమన్నారు. క్రిస్టియన్ లైన్‌ను విస్తరణను అలాగే వదిలిపెడితే రైతు రాజ్యం పార్టీ న్యాయ పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు హెచ్చరించారు.

## సీపీఎస్ రద్దుకు దశల వారీ పోరాటాలు: సీఐటీయూ

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:



ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడానికి యూటీఎఫ్ పోరాటానికి సీఐటీయూ సంపూర్ణమైన మద్దతు తెలుపుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ నిర్వహించిన 5కే రన్‌లో నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ సంఘం ప్రతి నిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు కోసం ఇప్పటికే పలుమార్లు పోరాటాలు చేశామని గుర్తు చేశారు. నేషనల్ సెక్యూ రిటీ డిపాజిటరీ లిమిటెడ్ ద్వారా సుమారు రూ.5వేల కోట్లు నిల్వ ఉందని, దీన్ని వెన్కి తెప్పించే ప్రయత్నాలు చేయాలన్నారు. మరో వైపు 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా కార్యదర్శి మహేష్‌బాబు పాల్గొన్నారు.

## 45వ డివిజన్‌లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:



కడప నగరం 45వ డివిజన్‌లో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ప్రజలకు తెలిపారు. ప్రజలపై చెత్తపన్ను, కరెంటు బిల్లుల పెంపు, పింఛన్ల తొలగింపు తదితర వాటిపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే జీవో నెంబర్ 1 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు మాసా పేట శివ, కొమ్మలపాటి సుబ్బరాయుడు, బాల దాసు, శ్రీనివాసులు, కోదండరాం, శివరాం, కొండా సుబ్బయ్య పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా విందులు ఇవ్వడం హర్షణీయం

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:



కడప నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా సంక్రాంతి విందు ఇవ్వడం ఎంతో హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిలానీ బాషా, డా.రబ్బానీబాషా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నేడు క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ గోపినాధ్‌రెడ్డి రాక

రైల్వేకోడూరు రూరల్, జనవరి 8 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలానిని సోమవారం రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ గోపినాధ్‌రెడ్డి వస్తున్నారని వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని కెసి అగ్రహారం నందు క్రికెట్ పోటీలను గోపినాధ్‌రెడ్డి హాజరు అవుతారని ఆయన తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో రైల్వేకోడూరు శాసనసభ్యులు, వైసిపి నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడలను తమ కుమారుడు రామిరెడ్డి రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి బహుమతి 50 వేలు, రెండో బహుమతి 25 వేలుగాను అందజేయనున్నట్లు వారు తెలిపారు.

## ప్రొద్దుటూరు బ్లడ్ డొనేషన్ గ్రూప్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 8, ప్రభాతవార్త



స్థానిక గీతాంజలి హైస్కూల్ అవరణలో ఆదివారం ప్రొద్దుటూరు బ్లడ్ డొనేట్ గ్రూప్ ఫౌండేషన్ వారి 2023 సంవత్సర క్యాలెండర్స్ ఆవిష్కరణ ప్రముఖ డాక్టర్ అయిన డాక్టర్ విశ్వనాథ్ రెడ్డిచే క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు బ్లడ్ డొనేట్ గ్రూప్ ఫౌండేషన్ టీం ప్రెసిడెంట్ ఫౌండర్ షేక్ మున్నా, వైస్ ప్రెసిడెంట్ లేపాక్షి వీర వర్ధన్, ట్రెజరర్ డేవిడ్ రాజ్. సహాయ కార్యదర్శులు బాబు సాని, చౌడయ్య, భాస్కర్ రెడ్డి, వైష్ణవి, వినయ్ తుల్లా, సురేంద్ర, శివజి యతీష్ వంశి పాల్గొన్నారు.

## దేవున్ని కనుగొని ఆరాధించాలి

ముద్దనూరు జనవరి 8, ప్రభాతవార్త



దేవున్ని కనుగొని, భక్తితో ఆరాధించాలని, ముద్దనూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ మర్రెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరు పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో, ఆదివారం నాడు దివ్యబలి పూజా కార్యక్రమంతో పాటు క్రీస్తు సాక్షాత్కార పండుగ వేడుకలు జరిగాయి. మన అనుదిన జీవితంలో, వాక్యము ద్వారా ప్రభువుని కనుగొని, ఆయనను భక్తితో ఆరాధించాలని ఫాదర్ మర్రెడ్డి ఇక్కడి విశ్వాసులకు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ముద్దనూరు, మంగపట్నం సిస్టర్లతోపాటు, ముద్దనూరు మండలం లోని వివిధ గ్రామాల నుంచి ఆర్సీఎం చర్చి విశ్వాసులు, ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు.

## విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 8, ప్రభాతవార్త



స్థానిక ఆచార్ల కాలనీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానము వద్ద ఆదివారం ప్రొద్దుటూరు విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జి.వి. సుజన్ రెడ్డి, కె. చరణ్ లక్ష్మి, ఇ.సాయి ప్రసాద్, కె. చక్రధర్, యం.ఎ. మహిర్, వై.హరీష్ కుమార్ వైద్య సేవలను అందించగా కాలనీ వాసులు విశేషంగా స్పందించి వారి వైద్యసేవలను అందించారు. రోగులను పరీక్షించడమే కాకుండా ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమానికి రాణీ తిరుమల దేవి డిగ్రీ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు వాలంటీర్స్ గా సేవలను అందించగా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, ఆలయ పాలక వర్గ సభ్యులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేశారు.

## ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి విశేష స్పందన

ఒంటిమిట్ట జనవరి8 ప్రభాతవార్త:



మండలంలోని నడింపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఇంటింటికితిరుగుతూ వైకాపా పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ఆడ్డగోలుగా నిత్యావసర దరలు డిజిల్ గ్యాస్, పెట్రోల్ విద్యుత్, మద్యపానం మాదవద్రవ్య సమస్య కుంటుపడిన ఆభివృద్ధి ఇసుక మాఫియా, తాగునీటి సమస్య ఆవినీతి మహిళల భద్రత కరెంటు సమస్య దుర్భరమైన రోడ్లు నిదులు దుర్వినియోగం గిట్టుబాటు ధరలు లేకపోవడం, రాజదాని లేని రాష్ట్రం, రాజకీయాలు నిలకడలేని పాలన, రేషన్‌కార్డులు,పింఛన్లుకోత వంటి విషయాలపై అవగాహన కల్పిస్తూ వారు వీటిలో ఎలాంటి సమస్యలను ఎదుర్కొ ంటున్నారో అడిగి తెలుసుకున్నరు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ ఆభ్యర్ధి గంటా నరహరి, రాజంపేట టిడిపి ఇన్‌చార్జి బత్యాల చెంగల్ రాయుడు, మండల పార్టీ ఆద్యక్షుడు నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల నాయకులు రమణ, లాయర్ రామదాసు, చంద్రశేఖర్‌రాజు, మహిళా నాయకులు ఒబినేని సుబ్బమ్మ, నరసింహాలు, మామిళ్ళ కృష్ణయ్య, రామాంజ నేయులరెడ్డి, కిరణ్ స్వామిమండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష

కడప ఎడ్యుకేషన్, జనవరి 8, ప్రభాతవార్త:

ఆదివారం జిల్లాలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షను జిల్లా కలెక్టర్ వి.విజయ రామరాజు ఆదేశాలు, సూచనలతో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలో 19 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు మొత్తం 8024 మంది అభ్యర్తులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 5746 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన 5723 మంది హాజరయ్యారని డీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫిబ్రవరి 8,9 తేదీల్లో పీడీఎస్‌యూ సమావేశాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 8, ప్రభాతవార్త:



ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఉమ్మడి కడప జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఫిబ్రవరి 8, 9 తేదీల్లో ప్రొద్దుటూరు పట్ట ణంలోని ఎన్‌జీవో హోంలో నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు తెలిపారు. కడప నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో జిల్లా జనరల్ కౌన్సిల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)2020 పేరుతో విద్యారంగాన్ని కాసాయీకరణ కార్పొరేటీకరణ చేస్తోందని హిందీభాషను బలవంతంగా రాష్ట్రాలపై రుద్దుతోందని ఫెడరల్ హక్కులను కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీ ఎస్‌యూ నగర నాయకులు మురళీకృష్ణ, తరుణ్, విగ్నేష్, విష్ణు, లోకేష్, రాజశేఖర్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, గాలివీడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పద్మావతి తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్‌కు స్థానికులై ఉండి పదో తరగతి పాసై ఉండాలన్నారు. ఆయాకైతే 7వ తరగతి పాసై స్థానికులై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 12వ తేదీ లోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. వివరాలకు లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

## మోయడానికి మేమున్నాం..

జమ్మలమడుగు, జనవరి 8, ప్రభాతవార్త:



స్థానిక జమ్మలమడుగు బెల్లలవీధిలో కొండయ్య (76) అనారోగ్యంతో చనిపోవడం తో అంతమ సంస్కారాలకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాలంటీర్ నిరీక్షణ మే హై హెల్ప్ యూ ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్‌రావును సంప్రదించారు. ఆయన ఆదివారం మధ్యాహ్నం 11.30 గంటలకు హిందూ స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కరణలు నిర్వహించారు. లక్ష్మణ్‌రావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఎవరైనా దాతలుంటే 8297253484, 9000879801 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ఆపద్భాంధవుడు ఉప సర్పంచ్ తోట శివసాయి

రైల్వేకోడూరు రూరల్, జనవరి 8 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని ఉంగ రాల నగర్‌లో కొన్ని సంవత్సరాలుగా వర్షపునీటితో పలురకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకొని వీధి ప్రజల విజ్ఞప్తి మేరకు రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివ సాయి ప్రజల తీర్పును శిరసా వహించి వేగవంతంగా వీధిరోడ్లను నిర్మించి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారని ప్రజలు పేర్కొన్నారు. ఆదివారం పట్ట ణంలోని ఉంగరాలనగర్‌లో భూగర్భ డ్రైనేజి వేసి వేగవంతంగా పూర్తి చేయడంతో ప్రజలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివసాయి అందరి వాడు అని ఆయన చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. ఈ సందర్భం గా తోట శివసాయి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ముందుంటుందని, అందుకు పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ఆర్య వైశ్య నాయకులు మేడా వెంకటసుబ్బయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు గునిశెట్టి రమేష్, మైనార్టీ నాయకులు ముజీబ్, భుజంగేశ్వర దేవాలయాల ఛైర్మన్ పోకల సుబ్బ రాయుడు, పోకల యోగానంద్, పోకల యుగంధర్ పాల్గొన్నారు.

## ముస్లిముల సంక్షేమం అభివృద్ధి ప్రధాన లక్ష్యం

ప్రొద్దుటూరు జనవరి 8, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమం అభివృద్ధి విద్య వైద్య సౌకర్యాలను కల్పించేందుకే ముస్లిం సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు అధ్య క్షులు ఖాజా మొహిద్దీన్ వెల్లడించారు. ఆదివారం స్థానిక జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులో మదరసాలో ఏర్పాటు చేసిన ముస్లిం సంక్షేమ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ అయిన జి హబీబుల్లా సంఘం ఏర్పాటుకు, సమావేశాలు నిర్వహించుకునేం దుకు సంఘానికి స్థలం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షులు బొల్లవరం భాషా ఆధ్వర్యంలో ప్రభు త్వ ఖాజీ హబీబుల్లాను ఘనంగా సత్కరించారు. ఈ సంక్షేమ సంఘం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫరీద్ భాషా కోశాధికారి జమాలుద్దీన్ సభ్యులు సుమారు 250 మంది ముస్లింలు పాల్గొన్నారు.

## యాదవుల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

### అఖిలభారత యాదవ మహాసంఘం తీర్మాణం

ప్రొద్దుటూరు జనవరి 8, ప్రభాతవార్త



రాష్ట్రంలో యాదవ కులానికి రాజ్యాధి కారమే అంతిమ లక్ష్యంగా ప్రతి నియోజక వర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు అఖిలభారత యాదవ మహా సంఘం నాయకులు వెల్లడించారు. ఆదివారం స్థానిక పారడైజ్ కళ్యాణ మండపంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీ చైర్మన్ అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లా రాజ గోపా ల్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ అఖిల భారత యాదవ మహా సంఘం 1924 ఏప్రిల్ 17న స్థాపించారన్నారు బ్రిటిష్ వారు ఇండియాను పరిపా లిస్తున్న కాలంలోనే ఎలాంటి కుల సంఘాలు లేని సమయంలో యాదవ సం ఘం ఏర్పాటు అయింది అన్నారు సమాజంలో గౌరవం దక్కాలంటే ఆర్థికంగా మనుగడ సాగించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి 20వేల ఓట్లు ఉన్నాయన్నారు ప్రొద్దుటూరు నియోజక వర్గంలో తాను స్వతం త్ర అభ్యర్థిగా శాసనసభకు పోటీ చేస్తానని నియోజకవర్గంలోని బీసీలను ఏకం చేసి గెలిచేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు లక్ష్మ య్య యాదవ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్ యాదవ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు యాదవ్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ సందే మాధవరావు జాతీయ ఉపాధ్యక్షులు బాలకృష్ణ యాదవ్ సుధాకర్ యాదవ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటయ్య యాదవ్ చల్లారవిశంకర్ యాదవ్ శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

## నేడు ఎబిఎంహెచ్ స్కూలులో శాశ్వత స్టేజీ ప్రారంభోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 8, ప్రభాతవార్త



అవధూత, పీఠాధిపతి, జగద్గురువులు పరమ పూజ్య గణపతి సచ్చిదానంద స్వామి వారు బాల్యంలో ప్రొద్దుటూరు లోని మునిసిపల్ హైస్కూల్ నందు 1953 సంవత్సరం విద్యాభ్యాసం గావించి, ప్రస్తుతం తమకు విద్యనందించిన ఈ స్కూల్‌కు ఒక శాశ్వత స్టేజిని నిర్మించి కానుకగా ఇవ్వాలనే సంకల్పంతో స్వామీజీ వారు నిర్మింపజేయించిన స్టేజి నేటి సాయంత్రం 6 గంటలకు దత్తపీఠ ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రారం భిస్తారని పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ శెట్టిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. తదుపరి పూజ్య శ్రీ స్వామీజీ వారి దివ్యనామ సంకీర్తనము, అనుగ్రహ భాషణము ఉంటుందని, అనంతరం ప్రసాద వినియోగం జరుపబడునని వివరించారు. పూర్వ విద్యార్థిగా ఉండి తను చదివిన స్కూల్‌కి ఒక శాశ్వత స్టేజీని నిర్మించుచున్న స్వామీజీ వారిని మునిసిపల్ స్కూల్ పూర్వ విద్యార్థులు అందరూ హాజరు అయ్యి గురుదేవుల ఆశీసులు పొందాలని సూచించారు.

## మానసిక వికలాంగులకు అన్నదానం

ముద్దనూరు జనవరి 8, ప్రభాతవార్త



ముద్దనూరు మండలంలోని, కోడిగాండ్ల పల్లె గ్రామ సమీపంలోనున్న, యేసు కరుణాలయ అనాథాశ్రమం లోని, మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ముద్దనూరు పట్ట ణంలోని ఎల్ ఎం కాంపౌండ్ యూత్ ఆధ్వర్యంలో అక్కడి మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేవి క్రీడలు

కడప వైద్యవిభాగం, జనవరి 8, ప్రభాతవార్త:



యువత ఆరోగ్యంతో పాటు ఆత్మ విశ్వాసంతో ఉండడానికి ఎప్పుడూ క్రీడలు ఆడడం అవసరమని, చదవుతో పాటు ఆటలు పాటలు మాటలలో నైపుణ్యం పెంపొందించాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వాలీబాల్ పోటీలు, యూత్ హాస్టల్‌లోని గ్రౌండ్స్ ప్రాంగణంలో నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న యువకులను ప్రోత్సహించడం కోసం ఈ వాలీబాల్ పోటీలు నిర్వహించా మని జిల్లా యువ అధికారి కె.మణికంఠ తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో స్పెషల్ ఆఫీసర్ బాషామొహిద్దీన్ క్రీడలను ప్రారంభించారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలను మణికంఠ అందజేశారు. కార్యక్రమంలో యువత నెహ్రూ యువజన సిబ్బంది, ప్రేమానందం, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# కమిటీ సభ్యులతో కురబసంఘం బలోపేతం కావాలి

### రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు

**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**



మండల కమిటీ సభ్యులతో కురబసంఘం బలోపేతం కావాలని రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కురవంక రాష్ట్ర కురబ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుని ఆధ్వర్యంలో మండల కమిటీల నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు కురబసంఘం పటిష్టతకు కృషి చేయాలన్నారు. అందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కూడా చొరవ చూపాలన్నారు. మదనపల్లె నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా జికె.వెంకటరమణ, అధ్యక్షులుగా కప్పల రాజన్న, మహిళా అధ్యక్షురాలిగా పద్మావతమ్మ, జనరల్ సెక్రటరీగా శీనా ఎన్నికయ్యారు. అదే విధంగా నిమ్మనపల్లె మండల అధ్యక్షులుగా రమణ, రూరల్ అధ్యక్షులుగా వెంకటరమణ, సెక్రటరీగా రమేష్, పట్టణ సెక్రటరీగా రాజకుమార్, వీరబల్లి మండల అధ్యక్షులుగా నాగయ్య, సెక్రటరీగా రమణయ్య, సుండిపల్లి అధ్యక్షునిగా జయరామ్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సెక్రటరీగా సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అదే విధంగా తంబళ్ళపల్లె నియోజకవర్గ అధ్యక్షులుగా గుడె శ్రీనివాసులను నియామకం చేసినట్లు తెలిపారు.

# అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**



అంగన్‌వాడీ నియామక నోటిఫికేషన్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, వర్కర్లుకు బదిలీలు ఇవ్వాలని కోరారు. ఎన్నో పోరాటాలతో సాధించుకొన్న పదోన్నతలను పక్కనపెట్టి నోటిఫికేషన్ విడుదల చేయడం భావ్యం కాదన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల్లోనూ అనేకమంది హెల్పర్ల ప్రమోషన్ల కోసం ధరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారన్నారు. సూపర్‌వైజర్ల పదోన్నతుల తరహాలో మిగిలిన వారికి కూడా పదోన్నతలు కల్పించాలన్నారు.హెల్పర్లకి, వర్కర్లకు పదోన్నతలు ఇచ్చిన తరువాతే అంగన్‌వాడీల నియామకం చేపట్టాలని కోరారు.

# వైకాపా పాలనలో ఆకాశానంటుతున్న ధరలు

### మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్

**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**



వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ధరలన్నింటిని పెంచి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తెలిపారు. ఆదివారం నీరుగుట్టవారిపల్లెలోని మాయాబజార్‌లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లచట్టాలను అడ్డంపెట్టుకొని ముఖ్యమంత్రిపరిపాలన చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన ప్రజలకు వివరించారు. రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గతంలోనే దివంగత నేత ఎన్‌టిరామారావు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. టిడిపి పెట్టినపథకాలన్నీ ముఖ్యమంత్రి రద్దు చేసి ప్రజలను అన్ని విధాల మోసం చేస్తోందన్నారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భవానిప్రసాద్, మహిళా కార్యదర్శి విజయమ్మ, తులసీధర్‌నాయుడు, మేకల రెడ్డిశేఖర్, నవీన్‌చౌదరి, త్యాగరాజు, వెంకటరమణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ నమోదుకు స్పెషల్ డ్రైవ్

**కురబలకోట, జనవరి 8 ప్రభాతవార్త:**



కురబలకోట మండలంలో ఆదివారం ఓటర్ నమోదుకు క్లైమ్‌ల స్వీకరణకు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు 18సంవత్సరాలు నిండిన యువతీ యువకుల నుంచి ఓటర్ జాబితాలో పేర్లు నమోదుకు క్లైమ్‌లను సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్ భీమేశ్వర్‌రావు పర్యవేక్షించారు. అలాగే మండలంలో 32,813మంది ఓటర్లు ఉండగా 79శాతం ఓటర్‌కార్డు ఆధార్ అనుసంధానం చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఇంకా 6966మంది ఓటర్లకు అనుసంధానం చేయాల్సి ఉందన్నారు.కార్యక్రమంలో ఆర్ఐలు, మండల సర్వేయర్లు, విఆర్ఓలు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సంకల్పపాదయాత్రకు నాలుగేళ్లు పూర్తి

**పీలేరు, జనవరి 8 ప్రభాతవార్త:**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ముగిసిన జనవరి 9వ తేదీతో నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో, గ్రామాలలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి కేకుకటింగ్ చేయాలని కోరారు.

# అర్హులైన పేదలందరికి అసైన్డ్ భూముల పట్టాలు ఇవ్వాలి

### –సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు

**రాయచోటి టౌన్.జనవరి 08 ప్రభాతవార్త**




రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అర్హులైన పేదలందరికి అసైన్డ్ భూములు పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత వ్ం ఏడు విడతల్లో భూ పంపిణీ చేసినప్పటికి అర్హులయిన పేదలకు సాగుకు అనుకూలంగా లేని కొండలు, గుట్టలు, వాగులు పంపిణీ చేశారని , ఇప్పటికి ఆ పట్టాలు భూములు ఎక్కడున్నాయో ఆ పేద ప్రజలకు తెలియదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తిరిగి చేపడుతున్న 8వ విడత భూ పంపిణీలో అర్హులయిన పేద ప్రజలందరికి 3 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని వేల రూపాయలు పేద ప్రజల నుంచి వసూలు చేస్తూ వారికి ఇష్టం వచ్చిన వారికి భూమి సాగులో ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తూ లక్షలు రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి అక్రమాలకు తావివ్వకుండా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రామ సభలు నిర్వహించి అర్హులయిన వారందరికి సాగు భూమి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి జక్కల వెంకటేష్, ఏఐటియుసి సీనియర్ నాయకులు వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తుమ్మల లవకుమార్, సిపిఐ పట్టణ నాయకులు పుల్లయ్య పాల్గొన్నారు.

# ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు ఇంటి స్థలాలు

**కురబలకోట, జనవరి 8 ప్రభాతవార్త:**



ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు పక్కాగృహల నిర్మాణాలకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నట్లు కురబలకోట తహశీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని బైసానివారిపల్లె వద్ద ఉన్న సర్వేనెంబర్ 834–బిలో 25ఎకరాలను ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు ఇంటిస్థలాలకు కేటాయించేందుకు సర్వే చేశామని ఆయన తెలిపారు. ఒక్కో నిర్వాసితునికి మూడు కుంటల స్థలాన్ని కేటాయించినట్లు ఆయన తెలిపారు.మండలంలో ఐదు గ్రామాల్లో ఎస్‌సిలకు, స్మశాన వాటికలకు 50సెంట్లు చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జగనన్న లేవుట్లలో పేదలకు 420మందికి ఇంటినివేశిత పత్రాలను లాటరీ పద్దతిలో పారదర్శకంగా ప్లాట్లు కేటాయించామన్నారు. స్వంత గృహలు ఉన్న వారికి పక్కగృహలు నిర్మాణం కోసం పోజిషియన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామన్నారు. చెన్నామర్రి వద్ద మరో 300మందికి ఇంటిప్లాట్లు మంజూరుకు ప్రభుత్వ భూమిని చదునుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 620మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, డిజిటల్ పాసుపుస్తకాలు జారీచేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో కొత్తగా రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకొన్న అర్హులైన వారిని గుర్తించి 825మందికి కొత్త కార్డులను మంజూరు చేశామని ఆయన తెలిపారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు గ్రామ రెవెన్యూ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని ఆయన తెలిపారు.

# బీటి కళాశాల ఆస్తులు ఆన్యాక్రాంతం కానివ్వం

### కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నమయ్య

**మదనపల్లెక్రైం, జనవరి 8 ప్రభాతవార్త:**



బీటి కళాశాలకు చెందిన ఏ స్థలాన్ని అన్యాక్రాంతం కానివ్వబోమని బిటి కళాశాల కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నమయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసెంట్ ట్రస్ట్‌కు చెందిన పాత పీజీహాస్టల్ కబ్జా అను శీర్షిక గురించి పత్రికలలో వచ్చిన వార్తలు అవాస్తవం అన్నారు. ఆ స్థలం ఆసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారడంతో పక్కనే ఉన్న శ్రీ వరాలంజనేయస్వామి ఆలయ కమిటీ ఈ ప్రదేశాన్ని శుభ్రపరచి ఆలయ అద్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగించుకుంటూమని అడగడం జరిగిందన్నారు. జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. వాటిని కూడా మనం అందరూ కలసి అరికట్టేందుకు ముందుకు రావాలని అలాగే ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దరి ఏ స్థలమైనా ఎప్పటికి ట్రస్ట భూమిగానే ఉంటుంది తప్పా ఎవరికి ఇవ్వడం కుదరదని తెలిపారు. పీజి హాస్టల్ స్థలంలో ఆలయ ట్రస్టు వారు దైవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆసాంఘీక కార్యక్రమాలు జరగకుండా నిరోధించడం జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ దివాకర్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఎపుడూ ఆస్తులు అన్యాక్రమం చేయదన్నారు. ఆ స్థలంలో దైవ కార్యక్రమాలు నిర్వహించిన, ఎప్పుడు బీసెంట్ ట్రస్టు భూమి తప్ప ఎవరిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆలమకమిటీ సభ్యులు ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సామాజికవర్గాన్ని ఆదుకోవడమే రెడ్డి జేపిసి ముఖ్యోద్యేయం

### రాష్ట్ర జేఏసికార్యవర్గసభ్యులు సత్యనారాయణరెడ్డి

**కలికిరి, జనవరి 8 ప్రభాతవార్త :**

పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గాన్ని ఆదుకునేందుకే రెడ్డిజేపిసి ముఖ్య ద్యేయమని రాష్ట్ర కార్యవర్గసభ్యులు పులిసత్యనారాయణరెడ్డి, ప్రముఖ న్యాయవాది రామ్‌ప్రసాద్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం కలికిరిలో ఎన్‌ఎం పంక్షన్‌హాలులో రెడ్డిజేపిసి ఆత్మీయ సమావేశం కార్యవర్గసభ్యులు పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పులి సత్యనారాయణరెడ్డి, ప్రముఖ న్యాయవాది రామ్‌ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ పదిమందికి అన్నంపెట్టి సహాయ సహకారాలు అందించే రెడ్డి సామాజిక వర్గానికి ప్రస్తుతం ఆదరణ కరువైందన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో విద్యా, వైద్యం సహాయ సహకారాలు అందడంలో వెనుకబడి ఉన్నారన్నారు. వారిని ఆదుకునేందుకే రెడ్డి జేపిసి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రెడ్డి కులస్థులకు రెడ్డిజేపిసి తరపున తమవంతు సహాయ సహకారాలు అందించి వారిని ఆదుకొంటామన్నారు. రెడ్డిసామాజిక వర్గంలోని వక్తలు, మేధావుల సలహాలు, సూచనలు తీసుకొని పార్టీలకుఅతీతంగా రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేసి ప్రకటించడం జరుగుతుందన్నారు. కార్యవర్గంలో చేరిన ప్రతిసభ్యునికి గుర్తింపు కార్డు అందిస్తామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా రెడ్డి సామాజిక వర్గం అందరూ ఐక్యమత్యంగా ఉండి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రెడ్డి జేపిసి తరపున పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వారు వివరించారు. రెడ్డి జేపిసి సమావేశానికి పీలేరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావడంతో రెడ్డి జేపిసి సమావేశం విజయవంతమైంది. రెడ్డిజేపిసి ఏర్పాటు చేయాలని పులి సత్యనారాయణరెడ్డికి ప్రముఖ న్యాయవాది రామ్‌ప్రసాద్‌రెడ్డికి రావడం ఎంతో సంతోషదగ్గ విషయమని పలువురు వారిని అభినందించారు. సమావేశంలో నాయకులు వై.ఆదినారాయణరెడ్డి, కంభం ద్వారకనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కె.సహదేవరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, కంభం వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ఆటోబోల్తా ముగ్గురికి గాయాలు

**మదనపల్లెక్రైం, జనవరి 8 ప్రభాతవార్త:**

ఆటోబోల్తా పడి ముగ్గురు గాయాపడిన సంఘటన ఆదివారం పుంగనూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్ ఇమాంబి(50) భర్త సత్తార్‌సాహెబ్(60) కుమారుదు మహబూబ్‌బాషా(31)ఆటోలో పుంగనూరుకు బయలుదేరారు. పుంగనూరు మండలంబీమగానిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

**మననపల్లెక్రైం, జనవరి 8 ప్రభాతవార్త:**



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మొలకలచెరువు మండల బురకాయలకోట పంచాయితీ సారగుండ్లపల్లెకు చెందిన ఎస్.ఆనంద(40) వ్యవసాయపనులు చేసుకొని జీవనంస ఆగిస్తున్నాడు. శనివారం ద్విచక్రవాహనంలో తంబళ్ళపల్లెకు వెలుతుండగా కన్నెమడుగు క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను మదనపల్లె జిల్లా ఆసుపత్రి నుంచి తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. తబళ్ళపల్లె పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మిట్స్ విద్యార్థులు హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్

**కురబలకోట, జనవరి 8 ప్రభాతవార్త:**



మిట్స్‌కు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఆదివారం హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. 100మంది ఎన్‌సిసి విద్యార్థులు ఉదయం 7గంటలనుంచి 11గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించి హార్సిలీహిల్స్‌కు చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ దేశ రక్షణ కొరకు అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరిని కాపాడుటకు ఇలాంటి కార్యక్రమాలు ఎన్‌సిసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. రోప్‌హ్యాండ్లింగ్, హిల్‌క్లింబింగ్ వంటి వాటిపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

# కరపత్రాలను పంచుతున్న తెదేపా నాయకులు

### బాధ్యత లేని పాలనతో ప్రజలకు తప్పని బాధలు

**వాల్మీకిపురం, జనవరి 8 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో పాలకుల బాధ్యత లేని పాలనతో ప్రజలకు బాధలు తప్పడం లేదని మండల తెదేపా అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అయ్యావారిపల్లెలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో తెదేపా నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి వైకాపా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బాధ్యత లేని వైకాపా ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరుకులు, విద్యుతు, బస్సు చార్జీలు పెరగడంతో సగటు కుటుంబం విపరీతంగా పెరిగిపోయి నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులుకు కరపత్రాలను పంచిపెట్టి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాజంపేట ఎస్సీ సెల్ అధ్యక్షులు గాంధీపేట రమణ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చంద్రమౌళి, తెదేపా నాయకులు సయ్యద్‌బాషా, ఆది. దాముర్రెడ్డి, సురేష్‌రెడ్డి, డిష్ బ్రదర్స్, చరమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ సాధనకు అందరం కలిసి పనిచేద్దాం

**వాల్మీకిపురం, జనవరి 8 ప్రభాతవార్త:**



ఎస్సీ వర్గీకరణ సాధన కోసం రాష్ట్రంలోని మాదిగలంతా ఏకమై లక్ష్యాన్ని సాదిద్దాం అని ఎమ్మార్పీయస్ మండల కన్వీనర్ బాలకష్ణ మాదిగులకు పిలుపునిచ్చారు. స్థానికంగా నిర్వహించిన మాదిగల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈనెల 11న బెంగుళూరు కేంద్రంగా ఎమ్మార్పీయస్, ఎంఎస్సీ, ఎంఎస్‌పీఎంఈఎఫ్‌ల ఆధ్వర్యంలో జరిగే జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ సాధన కోసం త్యాగాలు తప్పవన్నారు. మందకష్ణ మాదిగ నాయకత్వంలో మనమంతా ఉద్యమించడానికి సిద్ధం కావాలని ఎస్సీ వర్గీకరణ సాధనకై చదువుకున్న యువత బాధ్యతలు తీసుకుని గ్రామాలలో మాదిగ జాతిలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీయస్ పీలేరు కన్వీనర్ వెంకటరమణ, ఎమ్మార్పీయస్ నాయకులు నరసింహులు,ఎన్ నరసింహులు వెంకటాద్రి, వేణు, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# 70 మందికి వైద్య పరీక్షలు

**కేవి.పల్లె, జనవరి 8 ప్రభాతవార్త:**



మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో శ్రీనివాసచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాల వారు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈకార క్రమంలో వైద్యులు జిలాని, తదితరులు పాల్గొన్నారు.

# రూ.14.77 కోట్లతో మామిడి గుజ్జు పరిశ్రమ

### డీఎహెచ్ఓ రవిచంద్రబాబు

**పీలేరు, జనవరి 8 ప్రభాతవార్త :**



రూ.14.77 కోట్లతో మామిడి, టమోటా గుజ్జు పరిశ్రమ మంజూరైందని జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి చంద్రబాబు అన్నారు. ఆదివారం మండ లంలోని తలపుల అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులకు యాజమాన్యపద్దతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగాఈ ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పీలేరులో అన్నమయ్య వైవి.పాలెంలో సిద్దేశ్వర, మదనపల్లెలో మర్యాదరామన్న, నిమ్మనపల్లెలో రైతు సహకారాలు ఉన్నాయన్నారు. అన్నమయ్య, సిద్దేశ్వర సహకార సంఘాలకు రూ.14.77కోట్లు తో గుజ్జు పరిశ్రమ ఏపీఐఎల్ఐపీ–2(జైకా) ప్రాజెక్టు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తలపులలో పరిశ్రమ మంజూరైందన్నారు. ఇప్పటికే స్థల పరిశీలన పూర్తైందని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. తలపులకు రూ.45లక్షలుతో మూ డు కలెక్షన్ సెంటర్లు మంజూరైయ్యాయన్నారు. మామిడి రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. తిరుపతికి చెందిన చీనే, నిమ్మ, మామిడి పరిశోధన శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్దతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు వస్తుందన్నారు.గతేడాది 20 శాతం మాత్రమే పంట వచ్చిందని ఈసంవత్సరం మామిడి ఆశాజనకంగా ఉందన్నారు. పంట పూర్తైన తరువాత శాస్త్రీయ పద్దతుల ద్వారా మొక్కలు కత్తిరింపు, పిచికారి, ఎరువులు నీరు అందిస్తే పూత సకాలంలో వచ్చి పంట దిగుబడి బాగుంటుందన్నారు. ఈకార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సుకుమార్ రెడ్డి, రైతు సలహామండలి సభ్యులు బోదేషావలి, ధర్మారెడ్డి, ఉమాపతిరెడ్డి, కుమార్, సందీప్‌రెడ్డి, అన్నమయ్య రైతు సహకార సంఘం అధ క్షులు జయబ్బనాయుడు, కార్యదరి ్శ సురేం ద్రనాయుడు, సభ్యులు చక్రపాణిరెడ్డి, తిమ్మయ్య సురేంద్రరెడ్డి, ఆంజి,

# సమాన పనికి సమాన వేతనం

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

**పీలేరు, జనవరి 8 ప్రభాతవార్త:**



కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కార్మికులపై ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు వేధింపులు అధికమైయ్యాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఏఐటయూసీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెగులర్ ఉద్యోగులతో పాటే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రదర్శనలు, ఊరేగింపులు చేయకూడదని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని ఏమీ చేయకుండా జగన్‌మోహన్‌రెడ్డి కి భజన చేయాలా అని ఆయన ప్రశ్నించారు. వెంటనే జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య స్వీపర్లుకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై అన్ని తరగతుల కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోందన్నారు. కేంద్రం నిర్ణయించిన కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడం లేదన్నారు. 50 లక్షలు మంది కార్మికులు అర్ద ఆకలితో బ్రతుకుతున్నారు. ప్రభుత్వ సంస్థలను లేకుండా చేయాలని కేంద్రం చూస్తుండగా అందుకు రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికులు హక్కులు, కనీస వేతనాలు, రెగులర్ వంటివి లేకుండా చేస్తున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలో మహిళలు అధికమవుతున్నారని వారిపై లైంగిక వేధింపులు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రులకు , పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య స్వీపర్లుకు వేతనాలు పెంచాలని, ఇస్తున్న అరాకొర వేతనాలు నెలనెలా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. ఈకార క్రమంలో నరసింహులు, రాంప్రసాద్, యశోద, రమణమ్మ, సరస్వతి, నాగరాజు, వెంకటరత్నమ్మ, రమాదేవి, మునిరత్నం, రాజన్న, గురుమూర్తి, కష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# వివాహకార్యక్రమానికి ఏపీఎండీసీ డైరెక్టర్ హాజరు

**పీలేరు, జనవరి 8 ప్రభాతవార్త:**



పీలేరు పట్టణంలోని ఎంఎం ఫంక్షన్‌హాలులో కావలిపల్లె పంచాయతీ ఎఫ్ఏ సదామ్‌హుస్సేన్ చెల్లి వివాహ కార్యక్రమానికి రాష్ట్ర ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి హాజరై వివాహశుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

# గుండ్లపల్లెలో ఇదేం కర్మ కార్యక్రమానికి బ్రహ్మరథం

### – మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి

**తంబళ్లపల్లె, జనవరి 8, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలంలో ఆదివారం గుండ్లపల్లె పంచాయతీలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి తెలిపారు. ఉదయం టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై తూర్పారబట్టారు. నేటి ప్రభుత్వంలో పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు, నిత్యావసర సరుకులు, రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం ఇలా పలు సమస్యలపై ప్రజలకు ఇంటింటా కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగారెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్‌ల పర్యటనలను అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. అధికార పార్టీ నాయకులు పోలీసులను అడ్డం పెట్టుకొని శాంతియుతంగా మేము చేసుకుంటున్న కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో వారికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం తెదేపా ప్రశ్నావళిని పలువురికి పంచి పెట్టి వారి నుంచి ప్రజా వ్యతిరేక విదానాలపై సమాధానాలు రాబట్టారు. పంచాయతీలో అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షుడు గంగరాజు, మాజీ సర్పంచులు కృష్ణమూర్తినాయుడు, లక్ష్మీనారాయణ నాయుడు, బేరీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ చలపతి నాయుడు, సోమశేఖర్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు బేతెస్త ప్రార్థనా మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

### – ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

**కడప ఏడురోడ్లు, జనవరి 8, ప్రభాతవార్త:**



నగరంలోని మాసాపేటలో ఉన్న బేతెస్త ప్రార్థనా మందిరంలో సోమవారం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సంఘ ఆరాధన, చర్చి పాస్టర్ వర్రా వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పాస్టర్‌కు చర్చి కమిటీ ప్రెసిడెంట్ జలతోటి ప్రభుదాస్, సెక్రటరీ తాళ్లమోపూరి భాస్కర్ బాబు,సంఘ స్యులు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపించారు. ప్రార్థనల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ కాపరి వినోద్‌కుమార్, సంఘ అధ్యక్షుడు ప్రభుదాస్, కార్యదర్శి భాస్కర్‌లు నూతన బేతెస్త చర్చి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం ప్రత్యేక ప్రార్థనలు, అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజల కోసం శ్రీగాయత్రి నేత్రాలయం ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డా.టి.శశిబిందు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. రాయితీపై మందులు, కంటి చుక్కలు పంపిణీ చేస్తారని వివరించారు. ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక ప్రార్థలనకు ప్రతి ఒక్కరూ హాజరై దేవుని ఆశీర్వాదాలు పొందాలని చర్చి అధ్యక్ష కార్యదర్శులు కోరారు.

# సీనియర్ రాజకీయ వేత్త నజీర్ అహ్మద్‌కు ఘన సన్మానం

**కడప ఏడురోడ్లు, జనవరి 8, ప్రభాతవార్త:**



స్థానిక జేమ్స్ స్కూల్‌లో ఖూన్‌కా రిస్తా కేకేఆర్) నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. రక్తదాన అవగాహన సదస్సు నిర్వమించారు. నజీర్ అహ్మద్ మాట్లాడుతూ అపాయంలో ఉన్న వారికి ప్రస్తుతం కొంత మంది హిందూ ముస్లింలను విడదీసే ప్రయత్నంలో ఉన్నారు. కానీ రక్తం అవసరమైనప్పుడు అది హిందువుదా, ముస్లిందా, క్రిస్టియన్లదా అని చూడకుండా రక్తం తీసుకొని ప్రాణాలు కాపాడుకుంటున్నారు. యువకులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంవత్సరానికి ఒక సారైనా రక్తదానం చేసి అపాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ రాజకీయవేత్త, పూజ్యులు, గురువర్యులు షేక్ నజీర్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామని రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ షఫీ, మాజీ కార్పొరేటర్ అల్తాఫ్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కేకేఆర్ అధ్యక్షులు తారిక్ జేమ్స్ స్కూల్ కరస్పాండెంట్ మజహర్ అలీ ఖాన్‌ని అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌస్‌లాజం, ముఫ్తి మహ్మద్ అలీ బాగ్దాది, కార్పొరేటర్ షఫీ, డా.రబ్బానీ, మాజీ కార్పొరేటర్ అల్తాఫ్‌లను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, పవన్‌ల భేటీతో తొలగిన ముసుగు

**వేంపల్లె, జనవరి 8, ప్రభాతవార్త :**



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మధ్య భేటీతో ముసుగు తొలగిపోయిందని ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు ముత్యాల ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆరష్టంలో ఉన్న కాపులందరు ఏకం కావాలని కాపులకు రాజ్యాధికారం కావాలనే పవన్, ఇప్పుడు చంద్రబాబునాయుడుతో కలిసి కమ్మ కులానికి తాకట్టు పెట్టావా? అని ప్రశ్నించారు.చంద్రబాబు, పవన్ కలయిక వల్ల ఏపీకి ఒరిగిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కలిగి ఉందని తెలిపారు. చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. అభివృద్ధి సంక్షేమమే వైఎస్ఆర్‌సీపీ యొక్క లక్ష్యమని చెప్పారు.

# బాలుడి ఆకలి తీర్చిన హోంగార్డు

**కడప క్రైం, జనవరి 8, ప్రభాతవార్త:**



గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రంలో కమాండ్ అండ్ కంట్రోల్ హోంగార్డు కె.శ్రీనివాసులు (హెచ్‌జీ 358) మానవతా దృక్పథంతో తల్లి గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యేందుకు వెళ్లగా బాలుడికి ఆకలితో ఏడుస్తూ ఉండగా గమనించిన ఆయన బాలుడికి అల్పాహారం అందజేశారు. తానే స్వయంగా బాలుడికి తినిపిస్తూ మానవత్వం చాటుకున్నాడు. శ్రీనివాసులు సాయాన్ని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## వైద్య శిబిరంలో 210 మందికి చికిత్సలు

దువ్వూరు, జనవరి 8, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులోని పోలీసు నివాస గృహాల వద్ద ఆదివారం వినాయక ఫౌండేషన్, ఎస్‌సీసీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 210 మందికి వైద్య చికిత్సలు అందించినట్లు వినాయక ఫౌండేషన్ ఛైర్మన్ దివిటి గోపాలకృష్ణయ్య తెలిపారు. ఈ శిబిరంలో డా.భూమిరెడ్డి చంద్రశేఖర్, జనార్ధన్‌రెడ్డిలు రోగులను పరీక్షించి వివిధ రకాల మందులు అందించారు. ఇరువురు వైద్యులు ఎముకలు, కీళ్ల, నరములు వివిధ రకాల వ్యాధులకు చికిత్సలు అందించారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## పెట్రో ధరలు దేశంలో ఏపీలోనే అత్యధికం

వేంపల్లె, జనవరి 8, ప్రభాతవార్త :



పెట్రోలు, డీఇల్ ధరలు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కంటే ఏపీలోనే ఎక్కువగా ఉండటం శోచనీయమని ఏపీ కాంగ్రెస్ కమిటి మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ ధరల తగ్గింపు విషయంలో జగన్ ద్వంద్వ ప్రమాణాలు, రెండు నాలుకల ధోరణి ప్రదర్శించడం దురదృష్టకరమని తులసిరెడ్డి మండిపడ్డారు. కర్ణాటక, తమిళనాడు, తదితర పొరుగు రాష్ట్రాల కంటే ఏపీలో పెట్రోలు, డీఇల్ ధరలు లీటరుకు 6, 7 రూపాయలు ఎక్కువగా ఉన్నాయని, బాదుడే బాదుడని, తమ పార్టీ అధికారంలోకి వస్తే పెట్రో ధరలు తగ్గిస్తానని అటు పాదయాత్రలో, ఇటు శాసనసభలో జగన్ అనేకసార్లు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక జగన్ మాట తప్పాడు, మడమ తిప్పాడన్నారు. ప్రస్తుతం పెట్రోలు ధరలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉండడం గమనార్హం అన్నారు. పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ శాతం తగ్గించాలని, అదనపు వ్యాట్ ఉపసంహరించుకోవాలని, రోడ్డు సెస్సు ఉపసంహరించుకోవాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల, జనవరి 8, ప్రభాతవార్త :



పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోలా ప్రసాద్ సౌజన్యంతో సూర్య డ్యాన్స్ అకాడమీ మదనపల్లె చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ సూర్యకుమార్ శిష్య బృందంచే జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అదిగో అల్లదిగో శ్రీహరివాసము, గందశిరి వనమాలి, మేఘాలు ఈ వేళ చిన్నుకలే రావాలా, ముద్దుగారే యశోద, బృందావనికి చిందులు వేసి జై బాలయ్య, బంగారా బంగారా పిట్టల దొర, తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజి సమస్య పరిష్కారంపై దృష్టి సారించండి

పులివెందుల రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజి పనులకు ప్రాధాన్యతనిచ్చి మరమ్మతు పనులను చేపట్టాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని పాత ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాల్లోని నివాస గృహాల వద్ద డ్రైనేజి సమస్యలను రెండో వైస్‌ఛైర్మన్ హఫీజ్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళితో కలిసి ఆయన పరిశీలించి సమస్యను సత్వరం పరిష్కరించే విధంగా సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో డ్రైనేజి సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి సత్వరం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైకాపా నాయకుడు మస్తాన్, శానిటరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు నగదు బహుమతులు

వీరబల్లి.జనవరి 08 ప్రభాతవార్త



మండల కేంద్రంలో 2వ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్నది. ఈ టోర్నమెంట్ మాజీ ఎమ్మెల్యే కీ.శే.లు గాలివీటి విశ్వనాధరెడ్డి పేరు మీద వారి కుటుంబ సభ్యులు గాలివీటి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాద్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వైసిపి యువనాయకులు మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన సాయి లెవన్ జట్టు, కెఎం పల్లి జట్టు మీద గెలుపొందింది. సాయిలెవన్ జట్టు బ్యాట్స్‌మెన్ సచిన్ అత్యధిక పరుగులు చేయడమ కాకుండా నాటౌట్‌గా నిలిచి దాదాపు 10 ఓవర్స్‌లో దాదాపు 10 సిక్స్‌లు కొట్టాడు. అతని ప్రతిభ కనబరిచి నగదు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటమిలు, గెలుపులు సాధారణమన్నారు. ప్రతి ఆటగాడు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆట పట్టుదలతో సమయస్ఫూర్తితో ఆడినట్లయితే విజయం తధ్యమన్నారు.

## పేద రెడ్ల సంక్షేమం కోసం కృషి చేస్తాను

గాలివీడు.జనవరి 08 ప్రభాతవార్త



పేద రెడ్ల సంక్షేమ కోసం తనవంతు కృషి చేస్తానని ఏపి రెడ్డి సంఘం నూతన అధ్యక్షులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి రెడ్డి భవనంలో జరిగిన ఏపి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయిన సందర్భంగా అనంతరం గాలివీడు మండల కేంద్రంలోని తన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ వెనకబడిన పేద రెడ్ల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఏపి రెడ్డి సంఘం అధ్యక్షుడిగా నా మీద ఉంచిన నమ్మకాన్ని నేను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. పేరుకే అగ్రవర్ణం అని అందులో కూడా పేదలున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రెడ్ల వెనుకబాటు, రెడ్ల బాగోగులకు కోసం తన వంతు పూర్తి సహాయం చేస్తానని, రెడ్డి కార్పోరేషన్ ద్వారా అగ్రవర్ణ పేదలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఏపి రెడ్డి సంఘం అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపి రెడ్డి సంఘం గౌరవ సలహాదారులు ఉమాపతి రెడ్డి, శివగంగిరెడ్డి, గోరాన్‌చెరువు వైసిపి నాయకులు వెంకటాద్రి తదితరులు ఉన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి సొసైటీ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా బట్టలు పంపిణీ

**-ముఖ్య అతిథులుగా హాజరయిన అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు**

రాయచోటి.జనవరి 08 ప్రభాతవార్త



సంక్రాంతి పండుగ పురష్కరించుకుని శ్రీ అయ్యప్ప స్వామి సొసైటీ వారి ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేయడం చాలా అభినందనీయమని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయిన జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త మడితాటి శ్రీనివాసులు రెడ్డిలు అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం నందు అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు సొసైటీ అద్యక్షులు వీరబల్లి బసిరెడ్డి, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు మురళీమోహన్‌రాజు, లతో కలిసి ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. సొసైటీ తరపున ఇక ముందు కూడా మంచి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ కోర్టు షటిల్ టోర్నమెంట్

గాలివీడు.జనవరి 08 ప్రభాతవార్త

ఈనెల 10, 11, 12వ తేదీలలో మండల స్థాయి ఓపెన్ కోర్టు సెటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్స్ శ్రీనివాసరాజు, మురళీధర్‌రెడ్డి, ఉపేంద్ర పేర్కొన్నారు. పశ్చిమరాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి బండపల్లి మదన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వీరుచెప్పారు. ఇందులో ఉపాధ్యాయులు, యువకులు పాల్గొని టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని వారు కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పాత కొత్త మిత్రుల కలయికతో స్థానిక చెక్కవాళ్లపల్లి నందు ఉన్న ఓపెన్ కోర్టులో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన జట్టు సభ్యులు ప్రసాద్ 9393434384 అను నంబర్‌ను సంప్రదించి జట్టు వివరాలను నమోదు చేసుకొనవలెను. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా 5వేలు, రెండవ బహుమతిగా 3వేలు, మూడవ బహుమతిగా 2వేలు రూపాయలను అందజేయనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు స్థానిక ఓపెన్ కోర్టు షటిల్ ప్లేయర్స్ తెలియజేశారు.

## క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం.జనవరి 08 ప్రభాతవార్త



మండలంలోని రాయచోటి మదనపల్లి ప్రధానరహదారి ప్రక్కన ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో చిన్నమండెంకు చెందిన తౌహీద్‌ఖాన్, సతీష్ రాయల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమయిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిధిగా మాజీ టీటీడి పాలకమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై టాస్ వేసి ప్రారంభించారు. ప్రసాద్‌బాబు ఇరు జట్లను పరిచయం చేసుకుని కొద్దిసేపు సరదాగా బ్యాటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటలను ఎలాంటి అవకతవకలు చోట్టులేకుండా స్నేహభావంతో సంతోషంగా నిర్వహించుకోవాలని జట్ల సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడిపి నాయకులు రాంప్రసాద్‌రెడ్డి, సిద్దయ్య, బాలక్రిష్ణయాదవ్, సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, శంకర, సైపుల్లాఖాన్, వాజిద్, తంజీర్, ఫారూఖ్, జాఫర్‌ఖాన్, బరకత్, టమాటాల శివారెడ్డి, మహేష్, గౌస్‌ఖాన్, ప్రవాజ్, బడిశెట్టి రవి, కెసి ప్రసాద్, ఆఫ్రోజ్, ముని తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

రామాపురం.జనవరి 08 ప్రభాతవార్త



మండలంలోని కల్పనాయన చెరువు గ్రామంలో ఆదివారం లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయనకు కమిటి సభ్యులు, వైఎస్సార్‌సిపి నాయకులు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులుకు స్పోర్ట్స్‌లో సరైన నైపుణ్యం తీసుకోవడం జీవితంలో నిజమైన ఎంపికలు ఉంటే భవిష్యత్తును మార చ్గలరన్నారు. దీర్ఘకాలంలో క్రీడలు, అథ్లెటిక్స్‌లో చురుగా నిరంతరాయంగా పాల్గొనడం వల్ల ఫిట్‌నెస్, శ్రేయస్సు సంతోషంగా పరంగా గొప్ప పేరు ప్రతిష్టలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడిపల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి బాబు, వైఎస్సార్‌సిపి నాయకులు వెంకటసు బ్బారెడ్డి, కృష్ణయ్య, కమిటి సభ్యులు చెన్నారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చిన్నప్ప, చలపతి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయ పశ్చిమ రాజగోపురం నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి.జనవరి 08 ప్రభాతవార్త



రాయచోటి పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో రూ.1058 కోట్ల నిధులతో జరుగుతున్న పశ్చిమ రాజగోపురం నిర్మాణాలను ఆదివారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పనులపై ఆలయ ఛైర్మన్ విజయ, ఈవో రమణారెడ్డిలతో కలిసి ఆయన చర్చించారు. త్వరలో నిర్మించనున్న వసతి గదులు సముదాయ అనుమతులు మంజూరు చేయాలని ఆయన దేవాదాయ దర్మాదాయ కమీషనర్ ను శ్రీకాంత్‌రెడ్డి ఫోన్ ద్వారా కోరారు. వెండి రథం తయారీపై ఆలయ అధికారులు కమిటీతో శ్రీకాంత్‌రెడ్డి చర్చించారు. ఈ కార ్యక్రమంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, హబీబుల్లాఖాన్, పల్లపు రమేష్, ఆసీఫ్ అలీఖాన్, కమిటి సభ్యులు సరేష్, నాగభూషణం, రత్నశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా 100 రోజులు గడప గడపకూ మన ప్రభుత్వం

బద్వేలు అర్బన్, జనవరి 08 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బద్వేలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ ఆధ్వర్యంలో 100 రోజులు పూర్తి చేసుకొని 101 రోజులోకి అడుగుపెడుతున్న సందర్భంగా మాల మహాసేన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు చింతలచెరువు నారాయణ, మాల మహాసేన నాయకులు మీసాల రవి ఆధ్వర్యంలో ప్రత్యేక కేక్ కట్ చేసుకొని సంబ రాలు జరుపుకున్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కు ఇచ్చిన నవరత్నాల పథకాలను బద్వేలు నియోజకవర్గ స్థాయిలో ప్రతి గడపకు చేరేలా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎంత గానో కృషి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎంతగానో కృషి చేస్తున్నార న్నారు. నియోజకవర్గంలో రూ.400 కోట్లు ప్రత్యేక నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ పార్టీకే దక్కిందన్నారు. ప్రజలకు సుపరి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల పట్ల గడప గడపలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని, వారు అనంతరం ప్రత్యేక కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.కార్యక్రమంలో పీరయ్య, పిచ్చయ్య, మునెయ్య, సిద్దయ్య, పుల్లయ్య, సంటెయ్య, మల్లయ య్, రామకృష్ణ, డిబిఎఫ్ చిన్నయ్య పలువురు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేస్తాం

**ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు సముద్రాల మాధవీ లత**

బద్వేలు అర్బన్, జనవరి 08 ప్రభాతవార్త :



ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు మేమంతా కలిసి కూడా పేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేస్తామని ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు సముద్రాల మాధవీలత, సెక్రటరి పెసల శ్రీవాణి, ట్రెజరర్ దరిశా సౌజన్య, స్పీకర్ సముద్రాల స్వర్ణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీరాం సుప్రజ అన్నారు. ఆదివారం పలువురు ఆవోపా మహిళా విభాగం కమిటీ సభ్యులు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని వారు దర్శించుకున్నారు. ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలో అనేక సంవత్సరాల నుండి పేద ఆర్యవైశ్యులకు ప్రతి నెలా పింఛన్, ఉచిత మెడిసిన్ అందజేయడంతో పాటు అనేక మెడికల్ క్యాంప్‌లు కూడా ఏర్పాటు చేసి మెరిట్ విద్యార్థులకు అవార్డులను కూడా అందజేయడం జరిగిందని, ఆవోపా కమిటీతో పాటు ఆవోపా మహిళా విభాగం కమిటీ సభ్యులు కూడా ముందుండి తమ వంతు సహాయ సహకారాలు అందజేయడంతో పాటు పేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో తామంతా కృషి చేస్తామన్నారు. ధనుర్మాసం పురస్కరించుకొని ఆదివారం వాసవీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు అన్నదానం సుబ్రమణ్యం శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## హెల్మెట్ తప్పనిసరి : సిఐ లింగప్ప

చిన్నమండెం.జనవరి 08 ప్రభాతవార్త



రాయచోటి గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ లింగప్ప ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కేశాపురం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమయంలో ఉన్న తాధికారులు ఆదేశాల మేరకు హెల్మెట్ గురించి ద్విచక్ర వాహనదారులు వాహ నాన్ని నడిపిటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది ప్రమాద సమయంలో రక్షక కవచమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి**

నందలూరు, జనవరి 8 ప్రభాతవార్త



నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి పరిధిలో ఉన్న అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడామైదానంలో సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా ఆదివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం అంటేనే తెలుగుదనం ఉట్టిపడినట్లు కనపడే పల్లెటూర్లు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు వంటివి గుర్తు వస్తాయని అన్నారు. సిటిజన్ ఆధ్వర్యంలో సంక్రాంతికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో శుభదినమన్నారు. క్రీడలు అనేవి మానసిక ఉల్లాసం కలిగిస్తాయని దానివల్ల శారీరకంగా, మానసికంగా ఉల్లాసాన్ని ఇస్తాయని, సాంస్కృతిక కార్యక్రమాలు మన తెలుగు సంస్కృతి సంప్రదయాలకు నిలువుటద్దమని, ఇటువంటి కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని సంతోషంగా సంక్రాంతి ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జయభాస్కర్‌రావు, అధ్యక్షులు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి కె.విశ్వనాథ్, నందలూరు ఎస్ఐ మైనుద్దీన్, మండల ఉపాధ్యక్షుడు నాయనిపల్లె అనుదీప్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, క్రీడల ఆర్గనైజేషన్ డైరెక్టర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్యులకు సంక్రాంతి కానుకగా దుప్పట్లు పంపిణీ

**పబ్బతి హజరత్ బ్రదర్స్ సేవలు అభినందనీయం**

**– ఆవోపా కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డెయ్య**

బద్వేలు అర్బన్, జనవరి 08 ప్రభాతవార్త :



ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం కలిగిన వ్యక్తి, దాన ధర్మాలకు ప్రతీకగా ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేస్తున్న శ్రీ సాయి వెంకటేశ్వర లాడ్జ్ అండ్ కామన్ బెడ్స్ అధినేత పబ్బతి హజరత్, సత్యనారాయణ సేవలు ఎంతో సంతోషకరం అని ఆవోపా కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చప్పరపు సుబ్బారావు అన్నారు. ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ఆవోపా కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డెయ్య ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులకు ఒక్కొక్కరికి 300 రూపాయలు పింఛన్, అల్పాహారంతో పాటు, అనంతరం పబ్బతి హజరత్, సత్యనారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పలువురు పేద ఆర్యవైశ్యులకు ప్రతి సంవత్సరం మాదిరే దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా పేద ఆర్యవైశ్యులకు దుప్పట్లను హజరత్ సహకారంతో పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేద ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం దుప్పట్లు పంపిణీకి సహకరిస్తున్న హజరత్‌కు ఆవోపా కమిటీ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పబ్బతి హజరత్ పేద ప్రజలకు చేయూతనివ్వడమే కాకుండా కుల, మతాలకు అతీతంగా ఎక్కడ ఎవరు కష్టాలలో ఉన్నా వారికి చేయూతనిచ్చే గొప్ప మనసు కలిగిన వ్యక్తి అన్నారు.కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు సముద్రాల మాధవీలత, సెక్రటరి పెసల శ్రీవాణి, ట్రెజరర్ దరిశా సౌజన్య, స్పీకర్ సముద్రాల స్వర్ణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీరాం సుప్రజ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంక్షేమంలో ఎస్టీయు పాత్ర ఎనలేనిది

పోరుమామిళ్ళ రూరల్, జనవరి 8 ప్రభాతవార్త :



ఉపాధ్యాయ,విద్యారంగ సంక్షేమం కోసం ఎస్టీయు చేస్తున్న కృషి ఎనలేనిదని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలో రీజనల్ కన్వీనర్ కె.పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్టీయు భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాక మునుపే ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన ఘన చరిత్ర ఎస్టీయు సొంతమన్నారు. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలను ముందుండి నడిపించిన ఎస్టీయులో పనిచేసే ఉపాధ్యాయులు హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా భావించి పనిచేసే నైజం కలిగి ఉంటారన్నారు. పేస్కేల్స్,డి.ఎ, అలవెన్సులు, ఇంటి అద్దె, అప్రెంటీస్ రద్దు, ఎఎఎస్ తదితర సౌలభ్యాలను సాధించడం కోసం చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్,హెచ్.తిమ్మన్నలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిరంకుశ వైఖరి సరికాదన్నారు. అంతకు ముందు ఎస్టీయు పతాకాన్ని, శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ, రాష్ట్ర నాయకులు ఆవిష్కరించి, నూతన భవన్ ను ఉపాధ్యాయులకు అంకితం చేశారు. తదనంతరం భవన్ నిర్మాణానికి సహకరించిన దాతలందరినీ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్,ఏపి రాష్ట్ర మాజీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జోసఫ్ సుధీర్ బాబు, మల్లు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయవాణి ఎడిటర్ గాజుల నాగేశ్వరరావు, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి,వైసీపీ నాయకులు విశ్వనాథ రెడ్డి,జడ్పీటీసి సత్యనారాయణరెడ్డి,టీడీపి నాయకులు రంతు,రవి రాష్ట్రనా యకులు సుబ్రమణ్యంరాజు,బాలగంగిరెడ్డి, గురుకుమార్, దాదాపీర్, ఇలియాస్ భాష,బాలరాజు,జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి,కలసపాడు,కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల ఎస్టీయు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి యువత అన్ని రంగాలలో ముందుండాలి

**– సత్యా టౌన్‌షిప్ అధినేత సముద్రాల సుబ్బారావు**

బద్వేలు అర్బన్, జనవరి 08 ప్రభాతవార్త :



ప్రస్తుత సమాజంలో ఎంతో ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాలు నెరవేరకపోవడం పట్ల యువత నిరుత్సాహానికి గురికావలసిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, సత్యా హైవే టౌన్‌షిప్ అధినేత సముద్రాల సుబ్బారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సత్యా టౌన్‌షిప్‌లో ఎస్‌బి మొబైల్ షాపు అధినేత నాగేంద్ర రాయల్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న సముద్రాల సుబ్బారావు మాట్లాడుతూ ఎంతో ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాలను సాధించలేనపుడు వ్యాపార రంగాలలో కూడా ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్నవారు ఉన్నారన్నారు. ఇందుకు నిదర్శనం పి.నాగేంద్ర డిగ్రీ చదువు పూర్తయిన తరువాత మొబైల్ షాపు పెట్టుకొని తమ కుటుంబ పోషణ జరుపుకుంటూ మరి కొందరికి ఉపాధి కల్పించే విధంగా ముందుకు పోవడం ఎంతో సంతోషకరం అని, యువత ప్రతి ఒక్కరు కూడా క్షణికావేశాలకు గురికాకుండా విద్యలో ముందకు పోలేనపుడు స్వయం ఉపాధి కోసం ఏదో ఒక వ్యాపారం ద్వారా అయినా కుటుంబ పోషణ చేసుకోవచ్చని పలువురు యువతకు వారు పలురకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో యువతకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందజేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని నేటి యువత సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.ఆవులేటి శేఖర్ రాయల్, మున్సిపాలిటీ సూపర్‌వైజర్ ఆవులేటి బాబి, ఆవుల తేజా, ఆవుల హరికృష్ణ, వంశీ, అనుమల ప్రసాద్, ఆవుల ప్రసాద్, ఆవుల విక్కీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


వార్త ముగ్గుల పోటీలు

పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సలేషన్ బహుమతి కలదు.
◆ మహిళలకు సువర్ణ అవకాశం. ◆ ముగ్గు, రంగులు ఎవరికి వారే తెచ్చుకోవాలి.
◆ చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ◆ ముగ్గు వేయడానికి గరిష్ట సమయం 1 గంట.

బహుమతులు ఇచ్చు దాతలు :
శ్రీ వంశీధర్‌గౌడ్, డిఎస్పీ, మైదుకూరు.
శ్రీ బొమ్మన సుబ్బరాయుడు
బొమ్మనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు
శ్రీ జూటూరు మధుసూధన్‌రావు
జూటూరు డిజిటల్స్, బద్వేల్.
శ్రీ అరవ శ్రీనివాసులు యాదవ్
శ్రీపద్మావతి ఫర్నీచర్స్, బద్వేల్.
శ్రీ గురునాథ్
శ్రీగరుడసింహ ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్స్, బద్వేల్.
శ్రీ మానుగుంట రవిశంకర్
పిఆర్‌టియు జిల్లా జనరల్ సెక్రటరి, బద్వేల్.

బంపర్ బహుమతులు
మొదటి బహుమతి 36 inches ఎల్ఈడి టి.వి.
2వ బహుమతి వాషింగ్ మిషన్,
3వ బహుమతి విగార్డ్ ఫ్రిడ్జ్,
4వ బహుమతి బీరువా, 5వ బహుమతి మిక్సీ,
6వ బహుమతి టేబుల్ ఫ్యాన్.

వేదిక
వ్యవసాయ మార్కెట్ యార్డు
సిద్దవటం రోడ్, బద్వేల్
తేది : సమయం
మంగళవారం 10-01-2023
ఉదయం 10-00 గం॥లకు

సంప్రదించు నెంబర్లు :
9440024121, 9440977791, 9390275309.

భోజన వసతి కలదు
ముగ్గుల పోటీలో పాల్గొను వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోగలరు.

కన్సలేషన్ బహుమతులు, స్టేజి డెకరేషన్, ఫ్లెక్సిలకు సహకరించిన దాతలు :
శ్రీ డా॥ ఎన్.సత్యనారాయణ
విశ్వసాయి కళాశాల ఛైర్మన్, నెల్లూరు.
శ్రీ డా॥ కులాలి నాగేంద్ర ప్రసాద్‌యాదవ్
కార్డియాలజిస్టు, ఎనెల్ స్పెషాలిటి హాస్పిటల్, నెల్లూరు.
శ్రీ రూపరాజు చంద్రశేఖర్‌రావు
అడ్వకేట్, లీగల్ రిపోర్టర్ (వార్త), బద్వేల్.
శ్రీ షేక్ షాకీర్ హుస్సేన్
మాస్టర్ కట్ స్పా అండ్ సెలూన్, బద్వేల్.
శ్రీ షేక్ చాన్‌బాష
కెజిఎస్ గ్లాస్ షాపు, బద్వేల్.

భోజన వసతికి సహకరించిన వారు :
శ్రీ నాగిరెడ్డి శివమ్మ
టిడిపి 25వ వార్డు కౌన్సిలర్, బద్వేల్.
శ్రీ నాగిరెడ్డి జనార్ధన్‌రెడ్డి (కాంట్రాక్టర్)
టిడిపి సీనియర్ నాయకులు, బద్వేల్.